

కడప ఆర్‌డిఒగా మధుసూదన్

ప్రజాశక్తి - కడప



కడప నూతన ఆర్‌డిఒగా ఆర్. మధుసూదన్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనంతపురంలో పని చేస్తూ ప్రస్తుతం కడపకు బదిలీపై వచ్చామని అన్నారు. ముఖ్యమంత్రి జిల్లాలో పనిచేయడం అదృష్టం గా భవిస్తున్నానని, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల చేరువ చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. కలెక్టర్, ఉన్నత అధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ విధులు నిర్వహిస్తానన్నారు.

'అసైన్డ్'పై పెద్దల కన్ను

అసైన్డ్ భూముల పంపిణీ వ్యవహారం అందనిద్రాక్షను తలపిస్తోంది. ప్రభుత్వం ఇటీవల అసైన్డ్ భూముల సాగుదారులకు హక్కులు కల్పిస్తామనే పేరుతో 9-22 ఆర్డినెన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. జిల్లాలోని మండల రాజకీయ నాయకత్వం రాబంధుల అవతారం ఎత్తింది. అర్హులకు అసైన్డ్ భూములు పంపిణీ చేయాలనే ప్రభుత్వ ఆశయం దారి తప్పింది. ఆయా మండలాల రాజకీయ నాయకత్వాలు గ్రామాల్లోని పలుకుబడిన కలిగిన ధనికులకు, వారి సమీప బంధువులకు పాస్‌పుస్తకాల్లో ఎటువంటి భూములు లేవనే సాంకేతిక కారణాలను చూపించి, పెళ్లికాని యువకులు, పెళ్లయిన కుటుంబాల్లోని యువత పేర్లతో అసైన్డ్ భూములను కొట్టేయడం పరిపాటిగా మారింది. అసైన్డ్ కేటాయింపులకు సహకరించని తహశీల్దార్లపై దబాయింపులు, బెదిరింపులు, డిమోషన్లు, బదిలీలతో రాజకీయ నాయకత్వం గుప్పిట పట్టిన కారణంగా అర్హులకు అసైన్డ్ భూములను కేటాయించడం లేదనేది బహిరంగ రహస్యం.

- **రాజకీయం గుప్పిట్లో తహశీల్దార్లు**
- **డిమోషన్లు, బదిలీలతో ముప్పేట దాడి**
- **అసైన్డ్ వివరాల వెల్లడికి జిల్లా ఉన్నతాధికారులు ససేమిరా**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో కడప, బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. డివిజన్‌కు ఆరు వేల ఎకరాల చొప్పున సుమారు 25 వేల నుంచి 35 వేల ఎక రాల అసైన్డ్ భూములు ఉన్నట్లు అంచనా. సుమారు మూడు వేల ఎకరాలకు పైగా పంపిణీకి సిద్ధం చేసినట్లు సమా చారం. ఇటీవల పులి వెందుల మండలాల్లో అసైన్డ్ భూములను అనర్హులకు కేటాయించారనే వివరాలు బయటికి పొక్కడం రాజకీయ సెగలు పుట్టించింది. అనర్హులకు, ఉద్యోగుల పేర్లతో భూముల కేటాయింపులు చేయడం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వివాదాస్పదంగా మారిన మండ లాల్లో రీసర్వేకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

తహశీల్దార్లకు తప్పని వేధింపులు

జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 మండలాలు ఉన్నాయి. ఇందులోని అర్హులైన పేదలకు ఎనిమిదో విడత అసైన్డ్ భూసేకరణ, అర్హులు గుర్తింపు, భూముల కేటాయింపు వ్యవహారాలల్లో తహశీల్దార్లు క్రియాశీలక పాత్ర పోషించడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగంపై రాజకీయ నాయకత్వం కన్నేసింది. ఆయా మండల అధికార యంత్రాంగాన్ని గుప్పిట పట్టింది. తాను చెప్పిన వారికి అసైన్డ్ భూములను కేటాయించాలని హుకుం జారీచేస్తోంది. చేసేదేమీ లేకపోవడంతో కొంత మంది తహశీల్దార్లు రాజీపడి రాజకీయ నాయకత్వం చెప్పినట్లు చేయడం అని వార్యంగా మారినట్లు తెలు స్తోంది.



అక్కడికి బదిలీ చేస్తే సెలవుపై వెళ్లాల్సిందే!

జిల్లాలోని బ్రహ్మంగారిమఠం, వీరపునాయునిపల్లి తహశీల్దార్లుగా వెళ్లడం సవాలుగా మారింది. రెవెన్యూ భూముల రికార్డులు సక్రమంగా లేకపోవడం, రాజకీయ నాయకత్వాలు ఒత్తిడి కారణంగా సెలవులపై వెళ్లాల్సి వస్తోందనే వాదన వినిపి స్తోంది. ఇటీవలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తహశీల్దార్ల పనితీరుపై విమర్శలు వచ్చిన సందర్భంగా జాయింట్ కలెక్టర్ స్పందించి సదరు ప్రాంతాలకు ఎంతటి సీనియారిటీ కలిగిన అధికారులను పంపించినప్పటికీ విమర్శలే వస్తున్నాయనంటే అర్థమేమిటో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతోంది.

బెదిరింపు చర్యలతో హల్‌చల్

ఓ డిప్యూటీ తహశీల్దార్‌ను ఏడాది వ్యవధిలో ఆరుసార్లు బదిలీ చేయడం గమనార్హం. ఆర్నెళ్ల కిందట బ్రహ్మంగారిమఠం డిప్యూటీ తహశీల్దార్‌పై అధికార పార్టీకి చెందిన మండల నాయకత్వం భౌతిక దాడికి దిగే తరహాలో వీరవిహారం చేయడం తెలిసిందే. అనంతరం రాజకీయం చేసి డీమోట్, బెదిరింపులు, బదిలీలు వంటి సీన్లతో ఎపిసోడ్‌ను రక్తి కట్టించింది. వీరపునాయునిపల్లి, పెండ్లిమర్రి మండలాల్లోని కొండలు, ఒంటిమిట్ట మండల ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోని సారవంతమైన వందలాది ఎకరాల పిఒటి భూములు, కాశినాయన, పోరుమామిళ్ల మండల ప్రాంతాల్లో అటవీ ప్రాంతాల్లోని కడప, కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో ఉంటున్న ధనవంతులు అసైన్డ్ భూములను కొట్టేయడం గమనార్హం.

అసైన్డ్ వివరాలు వెల్లడించలేం

అసైన్డ్ భూముల వివరాలు బయటికి వెల్లడించలేం. ఇటీవల ప్రసార మాధ్యమాల్లో అనర్హులకు అసైన్డ్ భూములు కేటాయించారనే వార్తలు రావడంతో రీసర్వేకు ఆదేశించడమైంది.

- గంగాధర్‌గౌడ్, డిఆర్‌ఒ, కడప.

బహిరంగ సభను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివద్ధి కోసం నవంబర్ 1న జరిగే బహిరంగ సభ ను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్ పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయని తెలిపారు. ఎవరి కోసమో ఎదురు చూసే కన్నా మన బతుకులను, రాష్ట్ర భవిష్యత్తును సక్రమ మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్య మించాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఈ ఉద్యమంలో సిపిఎంతో ప్రజానీకం భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్ళు పూర్తి కావస్తోందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు పరిశ్రమ లాంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామికాభివద్ధికి గుండెకాయ.లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి సిద్ధమైందని విమర్శించారు. అన్నదమ్ముల్లా సమైక్యంగా మెలగవలసిన ప్రజల మధ్య బిజెపి విద్వేషాలు రాజేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కుల్ని హరిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలను రుద్దుతుందని తెలిపారు. దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి ద్రోహం చేసి విభజన హామీలకు ఎసరు పెట్టినా కేంద్రాన్ని పల్లెత్తు మాట అనే ధైర్యం లేనప్పుడు 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రజలకు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో, మోటార్లకు మీటర్ల పేరుతో, ఆస్తిపన్ను నుంచి చెత్తపన్ను వరకు అనేక భారాలు మోపుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు నామమాత్రంగా తయారవడంతో కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీకి సామాన్యులు బలైపోతున్నారనరి పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం, అంగన్వాడీలకు, ఆశాలకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దానాలన్నీ గాలికెగిరిపోయాయని విమర్శించారు. 1న జరిగే బహిరంగ సభకు సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ప్రధాన ఉపన్యాసకులుగా ఎం.ఎ.గఫూర్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఐ. క్రిష్ణయ్య, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె. ఉమామహేశ్వర రావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ ఉపన్యాసకులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, సిపిఎం జిల్లా అధ్యక్షులు జి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, బి.దస్తగిరిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులురెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, డి.ఎం.ఓబులేసు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

బద్వేలు : స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం రక్షణభేరికి సంబంధించిన పోస్టర్లను సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1న పట్టణంలోని నాలుగు రోడ్ల సెంటర్‌లలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. బద్వేల్ పట్టణ ప్రజలు, అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్య మేధావులు, కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు ప్రతి ఒక్కరూ బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బద్వేల్ సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు పి.చాంద్ బాషా, పట్టణ కమిటీ సభ్యులు గిలక రాజు, ఎస్.మస్తాన్, బి.కోడూరు మండల కార్యదర్శి ఆర్.ఓబయ్య, సిపిఎం నాయకులు జి.రెడ్డప్ప ,జి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం : డిసిసి

ప్రజాశక్తి - కడప

రైతుల సమస్యలను ప్రస్తు తం రాష్ట్రంలో అధి కారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం పూర్తిగా పట్టించు కోకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంల ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని అన్నారు. జిల్లాలో అన్ని మండలాలను కరువు ప్రాం తాలుగా ప్రకటించాలని కోరారు. రైతులకు పంట నష్టపరిహారం చెల్లించడంతోపాటు వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మైదుకూరులో రైతులు ఎదుర్కొంటున్న సమ స్యలపై ఈనెల 27న శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలో మైదుకూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రత్యేకించి జిల్లాలో కరువు విలయతాండవం చేస్తుందని అన్నారు. రైతులకు, రైతు కూలీలకు పనులు లేక వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరి తాళు బిగించారని అన్నారు. విద్యుత్ కోతలు పెరిగాయని అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకటరమణారెడ్డి, యూ త్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వెన్నపూస మధు రెడ్డి, నేషనల్ స్టూ డెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ ఖాన్, కోపూరు శ్రీనివాసులు, ఆనంద్ కుమార్, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఎ.సత్తార్

రోడ్లు, కూడళ్ల అభివృద్ధి చాలదు : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో ప్రధాన రోడ్లు కూడా అభి వృద్ధి మాత్రమే సరిపోదని, పేద లు నివసించే ప్రాంతా లనూ అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. ఏ. సత్తార్, జిల్లా ఉపాధ్యక్షులు నాసిర్ హుస్సేన్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'మేడిపండు చూడు మేలిమై ఉండు..పొట్ట విప్పి చూడ పురుగులుండు' అన్న చందంగా కడప నగర అభివృద్ధి ఉందని వారు పేర్కొన్నారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాస్త నగర అభివృద్ధి జరిగిందని అన్నారు. కడప నగరానికి ఐఎఎస్‌ను కమిషనర్‌గా నియమించడం హర్షణీయమే అన్నారు. కడప నగర అభివృద్ధికి రూ. 300 కోట్లు కేటాయించడం నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరి ష్కారంగా రోడ్ల విస్తరణ చేపట్టటం అభినందనీయమే అని వారు అన్నారు. కడపలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎండాకాలం వస్తే మంచినీటి ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. 300లకుపైగా వెనుకబడిన ప్రాంతాలు నగరంలో ఉన్నాయి అని వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా సెక్రటరీ బి సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోపూరి శ్రీనివాసులు, ఆనంద్ పాల్గొన్నారు.

రేపు ఉర్దూ ముషాయిరా

కడప అర్బన్ : జాతీయ ఉర్దూ కవి సమ్మేళనం, ముషాయిరా ఈ నెల 28న నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ జిల్లా శాఖ అధ్యక్షులు సత్తార్ ఫైజి ఒక ప్రక టనలో పేర్కొన్నారు. జాతీయ ముషాయిరాలో 22 మంది కవులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 10 మంది ప్రముఖ ఉర్దూ కవులు, కవయిత్రులు హాజర వుతారని తెలిపారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాష కవులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

సామాజిక న్యాయం కోసం చలో ఢిల్లీ

పోరుమామిళ్ల టౌన్ : దళిత హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయం కోసం డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగ దాసరి వీరయ్య పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో గురువారం చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విన్నవించాలని తలపెట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియో గించుకోవాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలుల్లోకి తీసుకురావాలని పేర్కొన్నారు. భూమి లేని ప్రతి పేదవాడికీ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా రెండు ఎకరాల భూ పంపిణీ చేయాలన్నారు. ఉపాధి ద్వారా 200 రోజుల పనిని కల్పించాలని, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటికలో పనిచేస్తున్న వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా పరిగణించాలని, దేశంలో లౌకికవాదాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. 401 సిఆర్‌సి నిబంధనలను రద్దు చేయాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను అమలులోకి తీసుకురావాలని అన్నారు. డప్పు, చర్మకారులకు రూ. 5 వేల పింఛను ఇవ్వాలని, పేదలు నిర్మించుకునే గృహాలరు రూ. 5 లక్షల నిర్మాణ వ్యయాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో రత్నమయ్య, నరసింహులు, చిన్న పాల్గొన్నారు.

ఎన్‌సిఇఆర్‌టి సిఫార్సులకు వ్యతిరేకం

ప్రజాశక్తి -పోరుమామిళ్ల టౌన్

విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలలో ఇండియా స్థానంలో భారత్ అనే పేరు చేర్చడంతో పాటు, చరిత్ర వక్రీకరణకు యత్నిస్తున్న ఎన్‌సిఇఆర్‌టి సిఫార్సులను వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ పేర్కొన్నారు. దేశంలో విపక్షాలన్నీ కలసి కూటమిగా ఏర్పడి, దానికి 'ఇండియా' అని నామకరణం చేసినప్పటి నుంచి బిజెపికి కంటిమీద కునుకు లేకుండా పోయిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇండియా పేరుపై రాద్ధాంతం చేస్తుందని, చివరకు పిల్లలు చదువుకునేటువంటి పాఠ్యపుస్తకాలపై కూడా వీరి ప్రభావం చూపడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా ప్రతి భారతీయుడు, రాజులు, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని , వారు కేవలం స్వాతంత్ర్యం కోసమే శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. బిజెపి ప్రభుత్వం చరిత్రను వక్రీకరించి ముస్లిం రాజుల చరిత్రను తొలగించాలని చూస్తోందని పేర్కొన్నారు. ఎన్‌సిఇఆర్‌టి తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఇండియా పేరును యథా తథంగా కొనసాగించి , చరిత్ర వక్రీకరణను చేయరాదని డిమాండ్ చేశారు.

రేపు చెన్నూరు మండల సమావేశం

చెన్నూరు : మండల సర్వేసభ్య సమావేశం ఈనెల 28న ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎంపిడిఒ సభాసభవనంలో ఎంపిపి సురేష్‌యాదవ్ అధ్యక్షతను నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డి. సుబ్రహ్మణ్యంశర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో విద్య, వైద్యం, తాగునీరు, పొదుపు సంఘాలు, నిత్యావసర సరుకులు, పారిశుధ్యం వంటి వాటిపై చర్చ ఉంటుందని అధికారులు తగిన సమాచారంతో సభకు హాజరు కావాలన్నారు. సమావేశానికి జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, కో- ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

'అమృత కలశయాత్ర'కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కడప

మేరీ మట్టి.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో నిర్వహించబోయే అమృత కలశ యాత్రలో పాల్గొనేందుకు కడప ఆర్ట్స్ కళాశాల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి హర్షం వ్యక్తం చేశారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా ర్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పురుషుల కళాశాల నుంచి చరణ్ తేజ, శ్రీధర్, సంతోష్ పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామకృష్ణ, నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ పి.రవిశేఖర్, బయపు రెడ్డి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

కళల ద్వారా సామాజిక ప్రగతి : మేయర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కళల ద్వా రా సామాజిక ప్రగతి సాధ్యమని మేయర్ సురేష్ బాబు పేర్కొ న్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో తొగటవీర క్షత్రియ చైతన్య దృశ్య శ్రవణ గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు కారణజన్ములని పేర్కొన్నారు. ప్రదర్శించే కళల ద్వారా సామాజిక ప్రగతి సాధ్యమని తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా ప్రాచీన కలలు ప్రముఖ పాత్ర వహించాయని చెప్పారు. కళారూపాలను సంరక్షించుకొని కళాకారులను ఆదుకోవాలని పేర్కొన్నారు. తొగటవీర క్షత్రియ చైతన్య గీతంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, సాధక బాధలను కళ్లకు కట్టినట్లు చూపించి ఐక్యమత్యం ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందని సమాజానికి సందేశం ఇవ్వడం ఎంతైనా అభినందనీయం అన్నారు. ఈ గీతాన్ని సూరిబాబు అద్భుతంగా తెరకెక్కించారని అభినందించారు. చదువు ప్రాముఖ్యత, సంస్కృతి సంప్రదాయాలు, దురాచారాల గురించి ఈ గీతంలో చక్కగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమంలో తాను కూడా పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయన కళాకారులను, చైతన్య గీతంలో పాలుపంచుకున్న సాంకేతిక నిపుణులను అభినందించి జ్ఞాపికలు బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, కార్పొరేటర్లు మల్లికార్జున, రామలక్ష్మణరెడ్డి,రాష్ట్ర వైసిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు శిబ్యాల విజయభాస్కర్, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, కడప సహాయ సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ, ఈడెం లక్ష్మీనారాయణ, చిత్ర గీతం దర్శకులు హబీబ్, సంగీత దర్శకులు సిహెచ్ బాబు, డిఒపి పెద్ద బుద్ధి ప్రసాద్, చౌడం నాగార్జున పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. గురువారం 16వ డివిజన్ మామిళ్ళపల్లి సచివాలయ తనిఖీల్లో భాగంగా సెక్రటరీల అటెండెన్స్, సర్వీస్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సచివాలయం సిబ్బందినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సచివాలయంలో ఉన్నటువంటి మరుగుదొడ్లను నిర్మించడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఇందిరానగర్‌లో సచివాలయం ఏర్పాటు చేయుటకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయవలసిందిగా సూచించారు. సెక్రటరీలు తమకు కేటాయించిన యూనిఫామ్ తప్పనిసరిగా ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు క్రమశిక్షణతో, మర్యాదపూర్వకంగా పనులు చేసి పెట్టాలన్నారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఒక్కరికీ తగు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయాలన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

జగనన్న సురక్షను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

ప్రజలకు మరింత చేరువలో వైద్యం

ప్రజాశక్తి- పోరుమామిళ్లటౌన్

జగనన్న ప్రభుత్వం ప్రజలకు వైద్యం మరింత చేరువ చేసిందని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 4వ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ప్రత్యేక వైద్యునిపుల చేత వైద్యం చేయించారు. అధిక శాతం మంది కంటి సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారని, వారి ఆపరేషన్ చేయించి కళ్లద్దాలు కూడా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ అడ్వైజర్ పోతిరెడ్డి నాగార్జునరెడ్డి, ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వైసిపి నాయకులు వివిధ రాష్ట్రస్థాయి సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- కడప అర్బన్ : వైసిపి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు వేస్తూ ఉందని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, మన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం 39వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు ఎపిలోనే ఆకాశాన్ని అంటుతున్నాయని పేర్కొన్నారు. దోచుకో, దాచుకో అన్న రీతిలో సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఇసుక, మట్టి, మైనింగ్ మాఫియా రాజ్య మేలుతూ ఉందని తెలిపారు. చంద్రబాబు నాయుడు మరో సారి ముఖ్యమంత్రి చేయకపోతే రాష్ట్రం అధోగతి పాల వుతుందని తెలిపారు. ఎలాంటి నేరం చేయకపోయినా జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. కడిగిన ముత్యంలో బయటకు రావడం ఖాయమని పేర్కొన్నారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు మాట్లాడుతూ ప్రజలు టిడిపిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఓబుల్ రెడ్డి, కొండ సుబ్బయ్య, ఏలియా, మీనాక్షి, స్వర్ణ, ఉమాదేవి, ఇమ్రాన్, అదిల్, గౌస్, లింగాల శివశంకర్ రెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

న్యాక్‌లో ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసి), ఏపీఎస్ఎస్ డిసి వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పిఎంకెవివై 4.0 ఉచిత 60 రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ మాట్లాడుతూ రోజుకు నాలుగు గంటలపాటు ఉంటుందన్నారు. ఆపరేటర్, సర్వీసింగ్‌లో కూడా మెళకువలు, భద్రత నేర్పిస్తారన్నారు. ఆసక్తిగల 18 నుండి 30ఏళ్ల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 99851 42155, 90005 17637 ఫోన్‌నెంబర్లను సంప్రదిం చాలని కోరారు.

జిఎస్‌టిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిఎస్‌టిపై అవగాహన సదస్సు ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఎపి స్టేషన్ ఆడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ షరీఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు అప్సర సర్కిల్ వద్ద ఉన్న శ్రీనివాసా రెసిడెన్సీలో సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. టాక్స్ పేయర్స్, డీలర్లు, ఆడిటర్లు, చార్టెడ్ అకౌంటెంట్స్ హాజరుకావాలని పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లా జాయింట్ కమిషనర్ కల్పన, డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లు జిఎస్‌టిపై అవగాహన కల్పిస్తారన్నారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, కన్స్ట్రక్షన్ టెక్నాలజీస్ మేనేజ్మెంట్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్ ఫొటోగ్రఫీ, అప్లయిడ్ ఆర్ట్, యానిమేషన్, ఆర్ట్ హిస్టరీ విభాగాలకు 3వ,7వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విసి ప్రొఫెసర్ బి.అంజనేయ ప్రసాద్ పరీక్ష నిర్వహణ గదులను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పోలీసు సిబ్బందికి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఎఆర్, సివిల్ విభాగంలోని కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ స్థాయి వరకు సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా హాజరయ్యారు. పోలీస్ సిబ్బందికి 'సోషల్ మీడియా దుర్వినియోగం- సైబర్ మోసాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికత ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఎఆర్ డిఎస్‌పి బి. రమణయ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్.ఐలు శ్రీశైలరెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, డిటి ఆర్‌బి ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్‌రెడ్డి, సైబర్ సెల్ ఎస్ఐ మధుమల్లేశ్వరరెడ్డి, ఆర్ఎస్ఐ లు స్వామి నాయక్, అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది, న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న పోలీసులు

ఉక్కు పరిశ్రమ కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - చక్రాయపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదాతోపాటు కడప ఉక్కు కర్మాగారం రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు ధృవకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముద్దప్పగారిపల్లెలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు మారాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కల్పించేందుకు తొలిసంతకం చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పారన్నారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ప్రత్యేకహోదా తెచ్చే స్థాయిలో లేవన్నారు. బిజెపికి మూడు పార్టీలు తొత్తులుగా మారాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ ప్రజలతోపాటు యువత, నిరుద్యోగులు, రైతులు ఆలోచించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ఆయన కోరారు. పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో చక్రాయపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ జెండా ఎగుర వేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు రామకృష్ణ, వేమయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ధృవకుమార్‌రెడ్డి

నేడు కసనూరుకు ఎంపీ రాక

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని కసనూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను శుక్రవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దాదాపు మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ నూతన భవనాలను ఆయన ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రైతులకు రాయితీతో పైపులు

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల పాడా ద్వారా రైతులకు రాయితీతో పివిసి పైపులు మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటన తెలిపారు. ఒక రైతుకు ఒక హెక్టార్ వరకు పైపులు పంపిణీ చేస్తామన్నారు. రైతుకు రూ.10 వేలు రాయతీ వస్తుందన్నారు. ఒక హెక్టార్ (2.5 ఎకరాల) వరకు రెండు ఇంచులకు చెందిన 45 పైపులకు రూ.10,250 డిడి రైతు కట్టాల్సి ఉంటుందన్నారు. ఒక్కో పైపు ధర రూ.228 అన్నారు. రెండున్నర ఇంచు పైపు ధర రూ.347 అన్నారు. రెండున్నర ఇంచు పైపులకు అయితే 30 పైపులకు రూ.10,400 డిడి కట్టాల్సి ఉందన్నారు. మూడు ఇంచు పైపు ధర రూ.440 అవుతుందని, వాటికి అయితే 25 పైపులు రూ.11000 డిడి కట్టాల్సి వస్తుందని చెప్పారు. 4 ఇంచు పైపులు కావాల్సిన రైతులు ఒక్కో పైపునకు రూ.628 చొప్పున 20 పైపులు రూ.12,560 రైతులు డిడి తీయాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్క రైతు దరఖాస్తుతోపాటు భూమి పాసు బుక్ జిరాక్స్, కొత్తగా తీసిన 1బి, ఆధార్ జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, బోరు మోటరుకు కొత్తగా కట్టిన కరెంటు బిల్లు, ఎస్సీ, ఎస్టీ క్యాస్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫోటోతోపాటు పూర్తి చేసిన దరఖాస్తు, డిడిలకు చెందిన నాలుగు జిరాక్స్ కాపీలు వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని ఎఒ సూచించారు. ఈనెల 31లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక సైదాగారి వీధిలో మన ప్రజాసేవా సమితి కార్యాలయంలో గురువారం నూతనంగా ఎన్నికైన జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మదీన దస్తగిరి, వనిపెంట సర్పంచ్ గౌస్ లాజం, వైసిపి మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి యాకూబ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన మదిన దస్తగిరి మాట్లాడుతూ జిల్లాలో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమైనవని, వాటిని తిరిగి ప్రభుత్వానికి అప్ప గించ డానికి అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనను సీఎం జగన్మోహన్‌రెడ్డి గుర్తించి ఈ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మన ప్రజా సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయుబ్ ఖాన్, గౌరవ అధ్యక్షులు అరబ్, ఉపాధ్యక్షులు సలీం, ట్రెజరర్ మహమూద్, ఎంపిజె రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీం, ఇన్ఫోటెక్ టూర్‌అండ్‌ట్రావెల్ అధినేత షేక్షావలి, అల్లా బకాష్, షరీఫ్, గఫార్ పాల్గొన్నారు.

దస్తగిరిని సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కోరారు. గురువారం మైదుకూరులోని వైసిపి కార్యాలయంలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి, విద్యకు, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలుపరిచారన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వ యకర్త నాగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

పరాశరన్‌కు స్వీయ చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

1958లో సుప్రీం కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి రెండు పర్యాయాలు అటార్నిజనరల్‌గా పనిచేసి హిందూ పవిత్ర గ్రంథాలను ఔపోసన పట్టిన పండితుడు చెన్నైకు చెందని కేశవ అయ్యంగార్ పరా శరన్‌కు ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రామాంజనేయరెడ్డి (మహేష్ ఆర్ట్స్) 'సేవ్ ది గర్ల్ చైల్డ్' లోగోతో స్వీయ చిత్రపటాన్ని బహూకరించారు. చెన్నైలో గురువారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఆరు దశాబ్దాలుగా తన కెరీర్‌లో శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం గురించి తన వాదనలు వినిపిం చారన్నారు. సేతుసముద్రం ప్రాజెక్ట్ కేసులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాదించి రాముడి కాలంలోనే సముద్రంలో బ్రిడ్జి నిర్మాణం జరిగిందని వాదనలు వినిపిం చారన్నారు. 140ఏళ్లుగా నలుగుతున్న చారిత్రాత్మక అయోధ్య కేసు పరిష్కా రానికి వాదనలు వినిపించారన్నారు. ఉద్దండ పండితుడైన పరాశరన్‌కు స్వీయ చిత్రపటాన్ని చిత్రీకరించి బహూకరించడం సంతోషంగా ఉందన్నారు. స్త్రీ సమాజాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సాదు పద్మభూషణ్, నారాయణ చిత్రకారిణి ప్రసన్న పాల్గొన్నారు.



11 మంది జూదరులు అరెస్టు

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు సిఐ చాంద్‌బాషా తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం రామిరెడ్డిపల్లి గ్రామంలో సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.21,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరి నూర్పిడి ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగైన వరి పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. సీతారామపురం, చాపాడు, చియ్యపాడు, కుచ్చుపాప, అయ్యవారిపల్లి, రామదాసుపురం, అల్లాడుపల్లె తదితర గ్రామాల్లో ఈ ఏడాది జులై చివరి వారంలో వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట పూర్తి కావడంతో వరి కోత మిషన్ల ద్వారా నూర్పిడి పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు 30 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. 8బస్తాల (పుట్టి) ధర రూ.13వేల వరకు పలుకుతోంది. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 3 వేల ఎకరాల వరకు వరి పంటను రైతులు సాగు చేశారు. తీవ్ర వర్షాభావంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో కెసి కెనాల్ పరిధిలో అనుకున్న మేర వరి పంటను సాగు చేపట్టలేదు. బోర్లు, బావుల ద్వారా కొంత మంది రైతులు ఆగస్టు చివరిలో సాగు చేపట్టారు. డిసెంబర్ రెండవ వారం నుండి నూర్పిడి పనులు కొనసాగే అవకాశం ఉంది. గత నెలలో గాలులు వీయడంతో వరి పంట నేలకొరిగింది. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రైతులు పంట పొలాల్లో అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ఏడాది వరి పంటకు ధరలు బాగా ఉండడంతో రైతుల్లో ఆనందం కనబడుతోంది. రైతులు రెండవ కారు వరి పంట సాగు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

అయ్యవారిపల్లెలో వరి పంటను నూర్పిడి చేస్తున్న యంత్రం

కరువుపై ప్రభుత్వ చర్యలు శూన్యం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుంటే జగన్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరువు నివారణకు ప్రభుత్వ చర్యలు శూన్యమన్నారు. 679 మండలాలకుగానూ 303 మండలాలు కరువు కోరల్లో ఉన్నాయన్నారు. ఖరీఫ్‌లో 40 శాతం సాగుభూమి బీడుగా ఉందన్నారు. సాగుచేసిన 60 శాతం భూముల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక ప్రజలు వలస పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక ప్రభుత్వం సెప్టెంబర్ నెలలోనే కరువు మండలాలుగా ప్రకటించిందని తెలిపారు. జగన్ ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నయ పంటల ప్రణాళికను అమలు చేయాలని కోరారు. విద్యుత్ కోతలు నివారించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు వెంటనే ప్రారంభించి వలసలు నివారించాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. అన్ని పంటలకు సమగ్ర పంటల బీమా, పశుగ్రాసం సరఫరా చేయాలన్నారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేసి, కొత్త రుణాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాలనా భాషగా తెలుగు అమలు తప్పనిసరి

- అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య

తహశీల్దార్ కార్యాలయంలో తెలుగు అమలుపై అవగాహన కల్పిస్తున్న తవ్వా

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు బాష అమలు తీరును పరిశీలించి తప్పనిసరిగా అధికార భాషగా అమలు పరచాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య తెలిపారు. రాష్ట్రస్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో అమలు చేయాలనే సదుద్దేశంతో అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు జిల్లాల సమీక్షలు జరుపుతున్నారని తెలిపారు. ఆయన ఆదేశాల ప్రకారం అధికార భాష సంఘం రాష్ట్ర సభ్యులు తమకు అప్పగించిన జిల్లాలలో క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గురువారం చాపాడు మండలం ప్రభుత్వ కార్యాల యాలను తవ్వా వెంకటయ్య సందర్శించి అధికార భాష తెలుగు అమలును సమీక్షించారు. చాపాడు మండలంలో పోలీస్‌స్టేషన్, ఎంపిడిఒ, రెవెన్యూ కార్యాలయం, పల్లవోలు మదూరు, అన్నవరం గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. సుమారు 70 శాతం పైగా పాలనా భాషగా తెలుగు అమలు జరుగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేసి అధికారులను అభినందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ యామిని, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, రెవిన్యూ సిబ్బంది, ఏఎస్ఐ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైసిపి ప్రభుత్వంలో ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ప్రొద్దుటూరులో నిర్వహించనున్న బస్సుయాత్రకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. బస్సు యాత్రలో సంఘ సభ్యుల సహకారం ఎంతో విలువైందన్నారు. గత టిడిపి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలను చంద్రబాబు నిర్లక్ష్యం చేశారన్నారు. వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజాసంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని వివరించారు. సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా చేపడుతున్న ఈ బస్సు యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గురప్ప, ప్రొద్దుటూరు టౌన్ అధ్యక్షులు కిశోర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాముడు, సుదర్శన్, సుధీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

సమస్యల పరిష్కారంలో విఫలం : పిడిఎస్‌యు

ఆందోళన చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని శ్రీ గీతాశ్రమం ఆవరణలో చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శంకర్ బాలాజీ పూర్తిగా విఫలం చెందారని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న ఆరోపించారు. తక్షణమే సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ గురువారం గీతాశ్రమం వద్ద విద్యార్థులుతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతాశ్రమం ఆవరణ పరిధిలో ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలు, ఎస్విడిసి డిగ్రీ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, నారాయణ పాఠశాల, కళాశాలలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీటి అభివృద్ధికి దేవదాయ శాఖ మాత్రమే పర్యవేక్షణ చేస్తుందన్నారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శంకర్ బాలాజీ నిర్లక్ష్యంతో ఓరియంటల్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల చెందిన విద్యార్థుల కోసం 10 బాత్రూంలకు రూ.18.5 లక్షలు వరకు ఖర్చు చేశారని తెలిపారు. ఏడాదిన్నర దాటకముందే బాత్రూంలు శిథిలావస్థకు చేరుకున్నాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పిడిఎస్‌యు నాయకులు యశ్వంత్, మల్లికార్జునరెడ్డి,బాలాజీ, విష్ణు, చంద్ర, నరేష్, కరీముల్లా పాల్గొన్నారు.

పండ్లు అందజేస్తున్న గుణవంత్‌రెడ్డి

అనాథాశ్రమానికి బియ్యం, పండ్లు వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల నాయకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి కుమారుడు యువ నాయకులు కటికరెడ్డి గుణవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమార్తెలు డాక్టర్ సంఘవీరెడ్డి, లిఖితారెడ్డి మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాథాశ్రమంలో మానసిక విభిన్నప్రతిభావంతులకు పండ్లు, చెప్పులు, వంద కిలోల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : వేంపల్లెలోని అనాథ వృద్ధాశ్రమాల్లో గురువారం అన్నదానం చేపట్టారు. ఎద్దులకొండ దేవస్థానం మాజీ చైర్మన్ కొండయ్య, నారాయణమ్మ కుమారుడు కొండ్రాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అన్నదానంతోపాటు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ప్రతి ఏడాది తన కుమారుడు కొండ్రాయుడు పేరు మీద అనాథ వృద్ధులకు తన వంతు సేవ చేస్తానని కొండయ్య చెప్పారు. కార్యక్రమంలో కొండయ్య కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

దోపిడీ తప్ప.. అభివృద్ధి ఎక్కడ?

పులివెందుల రూరల్ : వైసిపి ప్రభుత్వంలో దోపిడీ తప్ప అభివృద్ధి ఎక్కడని రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్ నాయుడు ప్రశ్నించారు. పులివెందులలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రాకముందు జగన్ పాదయాత్రలో ఎన్నో చెప్పారని, అవి ఏవీ పాటించలేదని విమర్శించారు. ప్రభుత్వం వచ్చిన నెలలోనే కడపలో ఉక్కు ఫ్యాక్టరీకి సంబంధించి సీఎం శంకుస్థాపన చేశారని, దానికి తాను కూడా వెళ్లానని తెలిపారు. నాలుగేళ్లు పూర్తయినా కాంపౌండ్ వాల్ కూడా నిర్మించకపోవడం దారుణమన్నారు. మైన విషయం అన్నారు. రైతులకు ఎక్కడ కూడా ఈ ప్రభుత్వం మేలు చేసిన దాఖలాల్లేవన్నారు. గండికోట రిజర్వాయర్‌లో 25 టిఎంసి నీరున్నా.. ఆ నీటిని కెనాల్ ద్వారా తీసుకొచ్చి లక్ష ఎకరాలకు ఇవ్వొచ్చని, అలా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు వంగల శశిభూషణ్‌రెడ్డి, భాను ప్రకాష్, మహేశ్వర్‌రెడ్డి, సుష్మ పాల్గొన్నారు.

లోపాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- వేంపల్లె

సైబర్ రంగంలో జరుగుతున్న అనేక లోపాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలతో చాలా మంది నష్టపోయారని తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజల్లో విద్యార్థులు చైతన్య తీసుకరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంప్యూటర్స్ శాఖ అధిపతి కిరణ్మయి, కో-ఆర్డినేటర్ షేక్ షఫీవుద్దీన్, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని ప్రభుత్వం డైట్ స్కూల్ సమీపంలో బస్టాండ్ రోడ్డు వద్ద వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని, వాల్మీకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వాల్మీకి అధ్యక్షులు గువ్వల యోగానందబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిష్టకు కలెక్టర్ గిరీష, ఎస్‌పి కృష్ణారావు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి వస్తారన్నారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే వైద్యం

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే వైద్యం వైసిపి ప్రభుత్వం అందిస్తున్నట్లు ఎంపిపి లక్ష్మి గాయత్రి తెలిపారు. గురువారం వేంపల్లెలోని 4వ గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం జరగలేదన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తున్నట్లు చెప్పారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించి, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, వార్డు మెంబరు బండల షకూర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, నాయకులు, గ్రామ సచివాలయ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపిపి గాయత్రి

రాయితీ శనగలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రాయితీ ద్వారా అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లె సర్పంచ్ రొండా అరుణమ్మ కోరారు. మండలంలోని కొత్తపల్లె గ్రామం పెనికల పాడు-2 ఆర్బికే పరిధిలోని రైతులకు గురువారం అరుణమ్మ ఆధ్వర్యంలో శనగ విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి మాట్లా డుతూ శనగ విత్తనం వేసే సమయంలో విత్తనశుద్ధికి ట్రయికోడెర్మావిరిడీ అనే శిలీంధ్రం మందును అందించనున్నట్లు చెప్పారు. విత్తనం వేసే సమయంలో తప్పనిసరిగా ఏదేని మందుతో విత్తనశుద్ధి చేయాలన్నారు. మండలంలోని రైతులకు 1126.20 క్వింటాళ్ళ శనగలు 40 శాతం రాయితీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. రబీలో సాగు చేసే అన్ని పంటలకు చీడపీడలు ఆశించకుండా విత్తనశుద్ధి చేసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు.

శనగలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎఒ

ఆర్‌బికెల్లో ఖరీఫ్ పంటల సాగు వివరాలు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో మండల పరిధిలో సాగైన పంటల వివరాలను గురువారం నుంచి ఆర్‌బికెల్లోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయాధికారి మ్యాగీ తెలిపారు. శుక్రవారం సామాజిక గ్రామ సభలు కూడా తమ గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించబడిన జాబితాను రైతులు పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే విఏఏలను సంప్రదించాలన్నారు. తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. రైతు పేరు, పంట విస్తీర్ణం, సర్వే నంబర్ తదితర వివరాలతో జాబితా అందుబాటులో ఉంటుందని ఎఒ వివరించారు.

రేపు చాపాడు మండల సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల సర్వ సభ్య సమావేశం శనివారం ఎంపీపీ టి.లక్షుమయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలస్థాయి అధికారులు పూర్తిస్థాయి నివేదికతో హాజరుకావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాలలో గుర్తించిన సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశానికి ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావలన్నారు. మహిళా ప్రజా ప్రతినిధుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అనుమతిలేదన్నారు.

శ్రీసంగమేశ్వర పాఠశాల వ్యవస్థాపకులు మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని శ్రీ సంగమేశ్వర ఎయిడెడ్ పాఠశాల వ్యవస్థాపకులు సోమ గంగాధర్‌రెడ్డి(82) అనారోగ్యంతో మృతి చెందారు. పులివెందులలోని తమ స్వగృహంలో గురువారం ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మండలంలోని గురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. అనంతరం పులివెందుల ఇతర ప్రాంతాల్లో పనిచేశారు. ఆయనకు జగన్‌మోహన్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి కుమారులున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. హరిప్రసాద్‌రెడ్డి తాను స్థాపించిన పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా ఇటీవల ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయడంతో లింగాల మండలం చిన్న కుడాల పాఠశాలలో పనిచేస్తున్నారు. గంగాధర్‌రెడ్డి మృతదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.


గంగాధర్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

బాబు వస్తేనే పేదల జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పేద బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు రావాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో గురువారం బాబుతో నేను, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా నారాపుర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ఆధారం లేకుండా చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక జగన్ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని విమర్శించారు. టిడిపి మినీ మేనిఫెస్టోను ఇంటింటికి తిరుగుతూ వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బాల పుల్లారెడ్డి, గట్టు పుల్లయ్య, మహేంద్ర, రామ్మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంఎం బాషా, పెద్ద పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం, మునేష్, జగదీష్, నాని, జగన్నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.


బాబుతో నేను కరపత్రాలు చూపిస్తున్న భూపేష్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబుపై బనాయించిన కేసుల నుండి ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని, నిజం గెలుస్తుందని జమ్మలమడుగు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని వినాయక నగర్‌లో గురువారం బాబుతో నేను, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, కొండారెడ్డి, తుంగ మోహన్, రఫీ, అఫ్జల్‌బాషా, లక్ష్మణ్ కుమార్‌రెడ్డి, చైతన్యకుమార్, సన్న, గౌస్, రెడ్డి బాషా, నన్నే, మాబాషా, కమాల్ పీరా, జిన్నా బాషా, శ్రీనివాసులు, చౌడయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి గురువారం పట్టణంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి వివరించారు. గాంధీ రోడ్డులో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజుపాలెం రూరల్ మండల కన్వీనర ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, 37 వార్డ్ పొట్టిపాటి గంగాధర్, కెవి కృష్ణారెడ్డి, కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, మధుబాబు, రాష్ట్ర దేవాంగ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.